క్లుప్తంగా

సంస్కృతి రక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం


పాల్గొన్న సేవకులు

కుభీర్: మండలంలోని బాకోట గ్రామంలో మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ సంస్కృతీ సంప్రదాయాలను రక్షించి కొనసాగించడమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా 44 సంస్థలు పని చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యకారణి సభ్యులు నాగమణి లింగన్న, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ కందుర్ శ్రీనివాస్, ఇతర స్వయం సేవకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాగడ హారతి ప్రారంభం


హారతిలో పాల్గొన్న భక్తులు

కుభీర్: మండలకేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజా మున ఉదయం 5:30 గంటలకు కాగడ హారతి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం దీపావళికి ముందు కోజగిరి పౌర్ణమి నుంచి దీపావళి తర్వాత వచ్చే పౌర్ణమి వరకు నెలరోజుల పాటు కాగడ హారతి నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన


బీర్నందిలో కేంద్రం పరిశీలిస్తున్న అధికారి

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి జీవరత్నం పరిశీలించారు. ఈసందర్భంగా ఓటర్లకు ఇబ్బంది రాకుండా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వెంట ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శి దేవేందర్, తదితరులున్నారు.

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్, ఓలా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో అల్లాడి వనజ మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, తదితర వసతులు కల్పించాలని ఆమె ఆదేశించారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, కార్యదర్శులు శ్రీనివాస్, యోగేశ్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వద్ద మహిళలు, యువతులు

సర్సాపూర్(జి): మండలకేంద్రంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం మహిళలు, యువతులు బతుకమ్మల వద్ద కోలాటం వేస్తూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

బాల్య వివాహాలు చేయొద్దు

భైంసారూరల్: ఆడపిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేయకుండా చదివిస్తే వారే ఉన్నతంగా ఎదుగుతారని విజన్ కమ్యూనిటీ మొబలైజర్ అనురాధ అన్నారు. మంగళవారం మండలంలోని ఇలేగాం గ్రామంలో విజన్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. చిన్న తనంలో పెళ్లిళ్లు చేస్తే ఎదురయ్యే సమస్యలను వివరించారు. బాల్య వివాహాల గురించి 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా జాతర


ఉత్సవమూర్తి

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జాతర ప్రా రంభమైంది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. పండితులు చక్రపాణి నరసింహమూర్తి, కోటపల్లి అనీష్, నితీష్ ఆధ్వర్యంలో విష్ణుయాగం, జాతర, రథ ప్రాణప్రతిష్ట, రథబలి తదితర పూజలు చేశారు. ఈసందర్భంగా సాంస్కృతిక భజనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ రాము నాయక్, బక్కి కృష్ణ, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అతి మధురం సీతాఫలం

- పండ్లకు కేరాఫ్‌గా పీచర గ్రామం
- విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న 90 కుటుంబాలు
- ఒక్కో పండు ధర రూ.40 పైనే


పై చిత్రంలో పండ్లు విక్రయిస్తూ కనిపిస్తున్నది పీచర గ్రామానికి చెందిన పాతర్ల లింగన్న. ఇతడు రైతుల నుంచి సీతాఫలం చెట్లను గుత్తకు తీసుకున్నాడు. తోటల వద్దే చెట్ల నుంచి తెంపి పక్కనే ఉన్న రోడ్డుపై తాజా పండ్లను అమ్ముతూ ఉపాధి పొందుతున్నాడు.


నిర్మల్ పాతబస్టాండ్‌లో పండ్లు విక్రయిస్తున్న పీచర గ్రామస్తులు

లక్ష్మణచాంద: జిల్లాలోనే లక్ష్మణచాంద మండలం పీచర గ్రామం సీతాఫలాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ ఊరి రైతులు ఎక్కువగా పంట చేన్ల గట్లపై సీతాఫలం చెట్లు పెంచుతుంటారు. ఇటు పంటల దిగుబడి.. అటు సీతాఫలాలను విక్రయిస్తూ రెండు వైపులా ఆదాయం గడిస్తున్నారు కొందరు రైతులు. మరికొందరు చిరువ్యాపారులు రైతుల నుంచే హోల్‌సేల్‌గా సీతాఫలాలను కొని జిల్లాకేంద్రంలో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. శీతాకాలంలో దొరికే ఈ ఫలంలో సమృద్ధిగా పోషక విలువలు ఉండటంతో సాధారణంగానే వీటికి డిమాండ్ పెరిగింది. క్రిమిసంహారక మందుల వినియోగం లేకుండా సహజసిద్ధంగా ప్రకృతి ఒడిలో పెరిగే ఈ పండ్ల కొనుగోలుకు ప్రజలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం

పలు కుటుంబాలకు జీవనోపాధి..

ముందురోజు సాయంత్రం చెట్టు నుంచి తెంపిన సీతాఫలం పండ్లను విక్రయించేందుకు మరుసటి రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రత్యేక ఆటోల్లో 40 మంది నుంచి 60 మంది వరకు నిర్మల్‌కు వెళ్తుంటారు. ఏటా శీతాకాలంలో పీచర గ్రామంలోని సుమారు 90 కుటుంబాలు సీతాఫలాలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. నిర్మల్‌లోని పాతబస్టాండ్ ప్రాంతంలోని మారుతి మెగా మార్ట్ ఎదుట, మారెమ్మ ఆలయం వద్ద, స్వామి వివేకానంద విగ్రహం వద్దకు సీతాఫలాలను విక్రయించే చిరువ్యాపారులే దర్శనమిస్తారు.

గతంతో పోలిస్తే..

మంచి పోషకాలు ఉండటంతో సీతాఫలం పండ్లకు డిమాండ్ ఉంటుంది. గతంతో పోలిస్తే ఈసారి కాత తక్కువ ఉండటంతో పండ్లకు డిమాండ్ ఏర్పడింది. ఈసారి నిర్మల్ మార్కెట్‌లో ఒక్కో ఫలం(సీతాఫలం) ధర రూ.40 నుంచి సైజును బట్టి ధర రూ.100వరకు పలుకుతోంది. 12 నుంచి 20 పండ్లున్న బుట్టకు రూ.1500 నుంచి రూ.2000 చెల్లించాలని అమ్మకందారులు పేర్కొంటున్నారు.

రోడ్డు పక్కనే అమ్మకం


చేనులో తాజా పండ్లు తెంపి పక్కనే ఉన్న రోడ్డు వద్ద అమ్ముతున్నాం. ఎక్కువ కాయలు వచ్చినరోజు నిర్మల్ వెళ్లి అమ్ముతున్నాం. రెండు నెలలు ఆదాయం బాగుంటుంది.

– నవ్య, పీచర

డిమాండ్ పెరిగింది


ఈసారి వర్షాల కారణంగా కాత ఎక్కువ రాలేదు. దీంతో తక్కువ పండ్లు మార్కెట్‌కు వస్తుండటంతో డిమాండ్ పెరిగింది. రెండు సీతాఫలాలనే రూ.100కు అమ్ముతున్నాం.

– లక్ష్మి, పీచర

కుమురం భీంకు నివాళి


సారంగపూర్‌లో భీం విగ్రహం వద్ద..


ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్


లోకేశ్వరం: నగర్‌లో..

భైంసాటౌన్: జల్, జంగల్, జమీన్ కోసం ప్రాణత్యాగం చేసిన కుమురం భీం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి సిబ్బంది నివాళులర్పించారు. అధ్యాపకులు రఘునాథ్, భీంరావు, పీజీరెడ్డి, రవికుమార్, శంకర్, సుధాకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు రాజు, ఓం ప్రకాశ్, సంతోష్‌కుమార్ ఉన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో భీం విగ్రహం వద్ద కాంగ్రెస్, ఆదివాసీ, గిరిజన సంఘం నాయకులు ని వాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సయ్య, దశరథ రాజేశ్వర్, ముత్యంరెడ్డి, జగదీశ్వర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: భీం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని పంచముఖి హనుమాన్ చౌరస్తాలో భీం విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, రవీందర్‌రెడ్డి, గడ్డం రవీందర్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, కొండవేణి రమేశ్, సుధాకర్ కుమార్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని నగర్‌లో భీం విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఖానాపూర్: పోషకాహారంతో సంపూర్ణ ఆరో గ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత అన్నారు. మంగళవారం పట్టణంలోని సుభా శ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, సూపర్‌వైజర్ శ్యామల, టీచర్లు సరోజ, మమత తదితరులున్నారు.

విచారణ జరపాలని వినతి

సర్సాపూర్(జి): సర్సాపూర్ (జి) గ్రామంలో 2024 మార్చిలో స్వచ్ఛ భారత్ మిషన్ పనుల్లో నిధులు దుర్వినియోగం అయ్యాయని మండలకేంద్రానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త మహమ్మద్ జాబీర్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వాల్ పెయింటింగ్, వాల్ రైటింగ్, 3డీ డిజైన్లు వేసినట్లు బిల్లులు సృష్టించి నిధులు కాజేశారన్నారు. విచారణ జరిపి కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ముధోల్, బాసర, లోకేశ్వరం, భైంసా, తానూరు మండలాల బీజేపీ నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని.. అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకు టికెట్లు ఖరారు చేస్తామని వివరించారు.

మస్కాపూర్ ఉపాధ్యాయుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

ఖానాపూర్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ గ్లోబల్ బెస్ట్ టీచర్ అవార్డు–2025 అందుకున్నారు. మంగళవారం న్యూఢిల్లీలోని కన్‌స్ట్రక్షన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన జాతీయ అవార్డు పురస్కార కార్యక్రమంలో తెలంగాణ నుంచి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ట్రోఫీతోపాటు సర్టిఫికెట్ అందుకున్నారు. నూతన విద్యావిధానం(ఎన్ఈపీ–2020) అమలులో చేస్తున్న కృషికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఐసీఐఎన్ కాన్ఫరెన్స్ చీఫ్ స్పీకర్ డా.సుశీల్‌కుమార్‌సింగ్, ఇంటర్నేషనల్ సోషల్ ఐకాన్ డా.జయలక్ష్మి, తదితరులున్నారు.

మళ్లీ వర్షం.. పంటలకు నష్టం


రోడ్డుపై వరద ప్రవహిస్తుండటంతో బాసర–కిర్గుల్(బి) మధ్య నిలిచిన రాకపోకలు


లోకేశ్వరం: లక్ష్మీనగర్ తండాలో దెబ్బతిన్న స్తంభం


మామడ: పొన్కల్‌లో తడిసిన మక్కలు


భైంసారూరల్: దేగాం వంతెనపై వరద ప్రవాహం

కుంటాల: మండలంలోని గ్రామాల్లో మూడు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం ఎండ కారణంగా ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. సాయంత్రం నుంచి ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుంటాల మండలంలో 7 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.

బాసరకు నిలిచిన రాకపోకలు

బాసర: మండలంలో కురిసిన భారీవర్షానికి ప్రధాన రహదారిపై వరద నీరు నిలువడంతో బాసర నుంచి కిర్గుల్ (బి)గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రెండు గ్రామాలకు మధ్య బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాకపోకలు బంద్..

భైంసారూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దేగాం గ్రామ సమీపంలోని వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో ఇలేగాం, సిరాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

మామడ: అకాల వర్షాలతో అన్నదాతకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం వర్షం కారణంగా మండలంలోని పొన్కల్‌తోపాటు పలు గ్రామాల్లో మొక్కజొన్నలు తడిసిపోయాయి. ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి మక్కలు కొనాలని పలువురు రైతులు కోరుతున్నారు.

లోకేశ్వరం: మండలంలోని లక్ష్మీనగర్‌తండాలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి సోయా, మొక్కజొన్న, వరిపంటలు దెబ్బ తి న్నాయి. లక్ష్మీనగర్ తండాకు విద్యుత్ సరఫరా చేసే మూడు స్తంభాలు విరిగి పడటంతో అంధకారం నెలకొంది. అధికారులు మర్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వాల్మీకి మహర్షికి నివాళి


కడెం: మొర్రిగూడెంలో నివాళులర్పిస్తున్న నేతలు


కుంటాల: ఓలాలో..

కడెం: జిల్లాలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. కడెం మండలం మొర్రిగూడెంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. వాల్మీకి సంఘ నాయకులు గుజ్జుల సురేష్, తక్కల్ల మహేష్, శ్రీనివాస్, సత్తన్న, గంగన్న, వెంకటేష్, మదనరాజు, అక్షయ్, తదితరులు ఉన్నారు..

కుంటాల: మండలంలోని ఓలాలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు. బోయ వాల్మీకి సంఘం అధ్యక్షుడు బొమ్మెన రాములు, ఉపాధ్యక్షుడు రాసురి రఘురాం, రాసురి గజ్జారాం, కంసాని గజ్జారాం, సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: మండలకేంద్రంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆ సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు సాయినాథ్, మల్లేశ్, సుభాశ్, లక్ష్మణ్, నర్సయ్య, పోశెట్టి, గంగాధర్, పుండలిక్, లక్ష్మణ్, సాయినాథ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతిని ముదిరాజ్ సంఘ నాయకులు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిటెండెంట్ అనిల్‌కుమార్ జాదవ్ చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, అనిల్, వీడీసీ అధ్యక్షుడు విఠల్, సాయిప్రసాద్, నారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో వాల్మీకి జయంతి, భీం వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు కృష్ణ, విద్యార్థులు ఉన్నారు.


తానూరులో..


ముధోల్‌లో..

'దాడి అమానుషం'

లోకేశ్వరం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మనువాద శక్తుల దాడి అమానుషమని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పోశెట్టి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జోహర్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ముతన్న, గజ్జన్న, శ్రీనివాస్, చిన్నన్న, సాయన్న ఉన్నారు.

ముగ్గురి బైండోవర్

తానూరు: మండలకేంద్రానికి చెందిన ముగ్గురిని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గంగయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గురిపై గతంలో రౌడీషీట్ నమోదైందని స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

సోన్: మండలకేంద్రంలో ఈడీఐఐ, యాక్సిం చల్ కంపెనీల ఆధ్వర్యంలో అగరుబత్తుల తయారీలో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ, రిసోర్స్‌పర్సన్ లక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో 60 మంది మహిళలకు 26 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి మహిళ వ్యాపారం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎండాకు తెగులుతో అప్రమత్తంగా ఉండాలి


సోన్ : బొప్పారంలో వరి పొలం వద్ద పరిశీలిస్తున్న ఏవో వినోద్‌కుమార్

సోన్: వరిపొలాలకు ఎండాకు తెగులు సోకుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఎండాకు తెగులు నివారణకు పొటాష్ చల్లుకోవాలన్నారు. పొలాలను ఆరబెట్టి నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు ప్లాంటోమైసిన్‌ను పిచికారీ చేయాలని రైతులకు సూ చించారు. కార్యక్రమంలో రైతులు పెద్దోళ్ల గౌతమ్‌రెడ్డి, వేణు, గంగన్న, భోజన్న తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: భారీవర్షాల నేపథ్యంలో వరి పొలాలు ఎండు తెగులు బారిన పడ్డాయని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని వడ్యాల్ క్లస్టర్ ఏఈవో మౌనిక తెలిపారు. మంగళవారం మండలంలోని వడ్యాల్‌లో వరిపొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. తెగులు నివారణకు రైతులు 15 లీటర్ల నీటిలో 45 గ్రాముల సీవోసీ, మూడు గ్రాముల ప్లాంటోమైసిన్ కలిపి పైరుకు పిచికారీ చేయాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

తానూరు: స్థానిక ఎన్నికల కోడ్‌ను ఉలంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై షేక్ జుబేర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్వి, హంగిర్గా, దాగాం గ్రామాల్లో పర్యటించారు. స్థానికసంస్థల ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల కోసం గొడవలకు దిగి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగవద్దని సూచించారు. మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు గురి చేస్తే కాని పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు ఇన్సులేటర్లు ధ్వంసం

కుంటాల: మండలంలోని గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన ఉరుములు, మెరుపుల వర్షానికి అందకూర్ చెరువు సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉన్న ఇన్సులేటర్లు పిడుగుపాటుకు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా గ్రామాలకు ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అంధకారంతో ఇబ్బంది పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది గంగాధర్, శ్రీనివాస్, అవధూత్, సతీశ్ మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బాసర: భారీవర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాసర బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. గోదావరి నది ఉధృతితో సోయా, పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. శనగ విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. గోదావరి వరదతో నష్టపోయిన చిరువ్యాపారులకు అండగా నిలబడాలని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ కిరణ్ కొమ్రేవర్, శ్యామ్, రామారావు, గంగారావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

భైంసాటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో భైంసా మండల నా యకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను.. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ నంగి రాజేశ్వర్ తదితరులున్నారు.

వైభవంగా శారదమాత ఉత్సవాలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలో ఏటా దుర్గా నవరాత్రి ఉత్సవాల అనంతరం శారదమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా బ్రాహ్మణగల్లి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం బ్రాహ్మణగల్లిలోని రాధాకృష్ణ మందిర్ హాల్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. బుధవారం ఐదురోజులు పూర్తవుతుండటంతో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు భక్తులు తెలిపారు.